క్లుప్తంగా

చల్లాకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



చల్లాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కందుకూరు: రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన చల్లా నర్సింహారెడ్డిని సోమవారం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, మదన్‌పాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జగదీశ్, సుభాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ కుమార్

మహేశ్వరం: మండల కేంద్రంలో కొలువుదీరిన శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయంలో స్వామివారికి అభిషేకం, హారతి, కుంకుమార్చన, పుష్పాలంకరణతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం, ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో శివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్ అల్లె కుమార్, పలువురు డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం



మూసి ఉన్న దుకాణాలు

బడంగ్‌పేట్: బజరంగ్‌దళ్, విశ్వహిందూపరిషత్, బీజేపీ ఆధ్వర్యంలో ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం 11 గంటల వరకు స్వచ్ఛందంగా వ్యాపారులు బంద్‌ను కొనసాగించి వారికి మద్దతు తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ సప్తగిరి కాలనీలోని వినాయకుడి మండపం కూల్చివేతకు నిరసనగా బంద్‌కు పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు, బజరంగ్‌దళ్, విశ్వహిందూపరిషత్ నాయకులు బడంగ్‌పేటలో ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూల్చివేసిన చోటే తిరిగి గణేశ్ మండపం నిర్మిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఇబ్రహీంపట్నం రూరల్: మండలంలోని తులేకలాన్ గ్రామ ఎంపీటీసీ మాజీ సభ్యురాలు నాగటి నాగమణి భర్త భాస్కర్ రెండు రోజుల క్రితం గుండెపోటుతో మరణించారు. విదేశాల్లో ఉన్న కుమారుడి రాక కోసం అంత్యక్రియలను తాత్కాలికంగా ఆపారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గ్రామానికి చేరుకొని భాస్కర్ మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణారెడ్డి, బుగ్గరాములు, యాదగిరి, చంద్రయ్య, కృపేశ్, సుకన్య, జంగమ్మ, రాంరెడ్డి, హంసమ్మ, బీరప్ప, కరుణాకర్‌రెడ్డి, మంగ, జ్యోతి, ఎంకమ్మ, రవీందర్‌రెడ్డి, సబ్‌రిజిస్ట్రార్ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

తహసీల్దార్‌కు బీజేపీ కిసాన్ మోర్చా నాయకుల వినతి

ఇబ్రహీంపట్నం: ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతారెడ్డికి బీజేపీ కిసాన్‌మోర్చా నేతలు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య, జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా ఎలాంటి షరతులు విధించకుండా రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని, ఖరీఫ్, రబీ సీజన్ కలిపి భరోసా పేరుతో ఎకరాకు రైతులకు రూ.15 వేలు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు విఠల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రంగారెడ్డి, శ్రీరాములు, వెంకటేశ్‌గౌడ్, కాళిదాసు, శ్రీను, పోచయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.



మహేశ్వరం: వైఎస్సార్ జోహార్ అంటూ నినాదాలు చేస్తున్న నాయకులు



కందుకూరు: వైఎస్సార్ విగ్రహం వద్ద అంజలి ఘటిస్తున్న కేఎల్ఆర్ తదితరులు

వైఎస్సార్ సేవలు మరువలేనివి

మీర్‌పేట: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి 75వ జయంతిని సోమవారం మీర్‌పేట మందమల్లమ్మ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసిన వైఎస్సార్‌ను తెలుగు ప్రజలు ఎప్పటికీ మరిచిపోరన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, నాయకులు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల దశరథ, పల్లె జంగయ్యగౌడ్, సురేందర్‌రెడ్డి, కీసర యాదిరెడ్డి, బైగళ్ల బాలమణి, పద్మ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు: వైఎస్సార్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ కార్యకర్తలకు సూచించారు. సోమవారం కందుకూరు చౌరస్తాలోని వైఎస్సార్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, పీసీసీ సభ్యులు ఎండీ నిజాముద్దీన్, దేప భాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో గల వైఎస్సార్ పార్కులోని ఆయన విగ్రహానికి మహేశ్వరం నియోజవర్గ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి భారీ గజదండ వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పి.సుదర్శన్‌రెడ్డి, రాళ్లగూడం శ్రీనివాస్‌రెడ్డి, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, నవారు మల్లారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట: మందమల్లమ్మ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి



బడంగ్‌పేట్: అల్మాస్‌గూడలో..

మహేశ్వరం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి పేదల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన మహానుభావుడని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గంలో గల అంబేడ్కర్ చౌరస్తాలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఆయన పలువురు నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్, మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షుడు బంగరిగళ్ల లాజర్, శివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్ అల్లె కుమార్, నాయకులు నేనావత్ రాజునాయక్, జంగయ్య, పరమేశ్, నారాయణ, షఫీ పలువురు పాల్గొన్నారు.

నేటి నుంచి నాటకోత్సవాలు

వనస్థలిపురం: భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖల సంయుక్త సహకారంతో ఆషాఢ మాస శతాబ్ది బోనాల ఉత్సవాల సందర్భంగా శ్రీ వినాయక నాట్యమండలి (సురభి) ఆధ్వర్యంలో వనస్థలిపురం హుడా గ్రౌండ్‌లోని సురభి థియేటర్‌లో ఈ నెల 9 నుంచి 14 వరకు నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆర్.వేణుగోపాల్ రావు తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు నాటకోత్సవాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభిస్తారని, కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సెక్రటరీలు శైలజ రామయ్యర్, వాణి ప్రసాద్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హనుమంత రావు, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

మాజీ పాలకవర్గానికి సన్మానం

మంచాల: ఇటీవల పదవీ విరమణ పొందిన మండలంలోని ఆరుట్ల గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని సోమవారం అధికారులు సన్మానించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు శ్రీనివాస్, రమేశ్, మాజీ వార్డు సభ్యులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ జంగయ్యగౌడ్, ఎంపీడీఓ బాలశంకర్, ఎంపీఓ మధుసూదన్‌చారి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, మాజీ వార్డుసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపీపీ..

ఆమనగల్లు: మాడ్గుల మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా ఇటీవల పదవీకాలం పూర్తి చేసుకున్న మాజీ వైస్‌ఎంపీపీ శంకర్‌నాయక్‌ను గుడితండాకు చెందిన నాయకులు సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ధనరాజ్‌నాయక్, తారాసింగ్, రాందాస్, వినోద్, కల్యాణ్, హోబా, నందు, రెడ్యానాయక్ పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి



కందుకూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు

కందుకూరు: రైతు సమస్యలను వెంటనే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు పల్లె కృష్ణగౌడ్, తలసాని జగదీశ్వర్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి కొంతం జంగారెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు రైతుల సమస్యలన్నీ పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు ఎ.అశోక్‌గౌడ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కె.చెన్నారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రుణం తీసుకున్న సంవత్సరంతో నిమిత్తం లేకుండా రుణం పొందిన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలన్నారు. రైతుబంధు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని, ఫసల్ బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ, కిసాన్ మోర్చా నాయకులు ఎస్.నర్సింహారెడ్డి, గౌర ప్రభాకర్, ఊటు మహేందర్, ఎస్.భూమిరెడ్డి, కె.సుధాకర్‌రెడ్డి, బి.దేవేందర్‌గౌడ్, జి.వెంకట్‌రెడ్డి, ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, ఎం.వెంకట్‌రెడ్డి, డి.యాదగిరి, పాండు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మంచాల: మండలంలోని ఆరుట్ల ఆదర్శ పాఠశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ బాలశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదర్శ పాఠశాల సమస్యలకు నిలయంగా మారిందన్నారు. పాఠశాల నిర్వహణ ఖర్చులు దుర్వినియోగం చేశాడని ప్రిన్సిపాల్‌పై ఆరోపణలున్నాయన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, రాము, జంగయ్య, సంతోష్‌రెడ్డి, శ్రీకాంత్, పెంటయ్య, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

'నియోజకవర్గ ఇన్‌చార్జిని మార్చండి'

తలకొండపల్లి: బీఆర్ఎస్ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్‌ను నియమించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ గౌడ సంఘం కన్వీనర్ అశోక్‌గౌడ్ కోరారు. ఆ దిశగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను ముందుండి నడిపించిన నేత ఉప్పల వెంకటేశ్ అన్నారు. అందుకే నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆయన్ని నియమిస్తే వచ్చే శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని సూచించారు.

వేతనాలు చెల్లించాలని వినతి

ఆమనగల్లు: గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని ఆమనగల్లు ఎంపీడీఓ కుసుమ మాధురిని కోరారు. పట్టణంలో సోమవారం ఎంపీడీఓ కుసుమ మాధురిని గ్రామ పంచాయతీ కార్మికులు కలిసి తమ వేతనాలను వెంటనే అందించాలని కోరుతూ వినతిపత్రం అందించారు.

గిరిజనుల సంక్షేమానికి పాటు పడండి



ఎంపీ బలరాంనాయక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రవీందర్‌నాయక్

ఆమనగల్లు: మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్‌ను సోమవారం కాంగ్రెస్ జిల్లా ఎస్టీ సెల్ నాయకుడు మేడిగడ్డ రవీందర్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో రవీందర్‌నాయక్ ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ వినతి పత్రం అందించినట్లు రవీందర్‌నాయక్ తెలిపారు.

స్థిరాస్తి పేరుతో చెరువుల కబ్జా

మత్స్యకారుల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ

మంచాల: కబ్జాకోరుల నుంచి చెరువులను కాపాడాలని మత్స్యకారుల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహ డిమాండ్ చేశారు. సోమవారం మండంలోని ఆగాపల్లిలో నిర్వహించిన మత్స్యకారుల కార్మికుల సంఘం జిల్లా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్, పట్టణీకరణ, పరిశ్రమల పేరుతో పెద్ద ఎత్తున చెరువులు కబ్జాలకు గురవుతున్నాయన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కనీసం కబ్జాలకు గురవుతున్న నీటి వనరుల వైపు చూడకపోవడం శోచనీయమన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత చేప పిల్లల పంపిణీ స్కీం కొనసాగిస్తూ, మత్స్య సొసైటీల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, విష పదార్థాలు కలిసి చేపలు చనిపోతే నష్టపరిహారానికి ప్రత్యేక జీఓ తీసుకొని రావాలన్నారు. కాగజ్‌ఘట్‌లోని అల్లి చెరువు కబ్జా విషయంలో చట్ట బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, నాయకులు చక్రపాణి, జంగయ్య, శ్రీనివాస్, నర్సింహ, రాజు, కొండల్, రాములు, యాదయ్య, రమేశ్, భాస్కర్, హన్మంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ

తుర్కయంజాల్: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులతో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ సూచించారు. సోమవారం ఆమె రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో పాలకవర్గసభ్యులు, వైద్య సిబ్బంది, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విష జ్వరాలకు దోమలే ప్రధాన కారణమని, వాటి నివారణకు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. వ్యాధుల ప్రబలకుండా అధికారులు, సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నీటి సమస్యలు తలెత్తకుండా ఉండేలా జలమండలి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న పైప్‌లైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత, జలమండలి జీఎం శ్రీధర్, డీజీఎం సునీల్, మేనేజర్ వినయ్, డాక్టర్ శ్రావణ్, పుర డీఈఈ సత్యనారాయణ, ఏఈఈ మల్లికార్జున్, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, అధికారులు

మొక్కలు సిద్ధంగా ఉంచండి

మహేశ్వరం ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ శైలజ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉప్పుగడ్డ తండా, పడమటి తండాల్లో నర్సరీలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఉన్న నర్సరీల్లో మొక్కలను పెంచాలన్నారు. త్వరలో మండలంలో ప్రారంభం కానున్న వన మహోత్సవం కింద లక్ష మొక్కలను నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించుకున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో 3 వేలకు పైగా మొక్కలను నాటుతామన్నారు. మొక్కలు నాటేందుకు గుంతలను తవ్వుతున్నామని తెలిపారు. గ్రామాల్లో మొక్కలు నాటేందుకు ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శైలజ

కనుల పండువగా వారాహిదేవి నవరాత్రులు



ప్రత్యంగిరా దేవాలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు



ఎమ్మెల్సీ వాణిదేవికి అమ్మవారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ సెక్రటరీ శ్రీనివాస్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠ శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి మందిరంలో శ్రీ వారాహిదేవి నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగానే సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో కుంకుమార్చనలు, పారాయణలో మహిళలు అధిక సంఖ్యలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ పూజ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణిదేవి, చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ వాణిదేవి మాట్లాడుతూ మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు కుటుంబానికి కుర్తాళం పీఠంతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేశారు. పీఠాధిపతులు జగద్గురు శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి మహా మంత్ర స్వరూపులని తెలిపారు. ప్రత్యంగిరా అమ్మవారు, శ్రీవారాహిదేవి చాలా శక్తి దేవతలని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్ అమ్మవారి జ్ఞాపకం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ కృష్ణాపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రామారావు, వెంకటేశ్వర్లు, విఠల్ శర్మ, సాయికుమార్ శర్మ , అరుణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీకాంత్ కాలనీకి చెందిన మేస్త్రీ బాలస్వామి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో మృతుడి కుటుంబాన్ని సోమవారం గతంలో శివదీక్ష తీసుకున్న స్వాముల ఆధ్వర్యంలో పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి రూ.40 వేలు ఆర్థికసాయం అందించారు.

పరామర్శ

తలకొండపల్లి: మండలంలోని వెల్జాల్‌కు చెందిన వెంకటమ్మ(62) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, తలో రూ.మూడు వేల చొప్పున నగదు అందజేశారు.

కార్యకర్త కుటుంబానికి..

కడ్తాల్: మండలంలో గుర్లకుంటతండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు రాజునాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని సోమవారం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరామర్శించి రూ.5 వేల నగదు అందజేశారు.